## క్లుప్తంగా

### అయ్యప్ప ఆలయాన్ని సందర్శించిన సినీ డైరెక్టర్



ఆలయ నిర్మాణ విశేషాలు తెలుసుకుంటున్న సినీ డైరెక్టర్ నాగేశ్వరరెడ్డి

**కోడుమూరు రూరల్:** దాతల సహకారంతో నిర్మిస్తున్న ధర్మపురి అయ్యప్ప స్వామి ఆలయాన్ని సినీ డైరెక్టర్ జి.నాగేశ్వరరెడ్డి గురువారం సందర్శించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యుడు భాస్కర్‌రెడ్డితో ఆలయ నిర్మాణ విశేషాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గోపి, రాఘవేంద్ర, అశోక్‌కుమార్, బాలాజీ పాల్గొన్నారు.

### నాటుసారా నిర్మూలనకు సహకరించండి

**కోడుమూరు రూరల్:** నాటుసారా నిర్మూలనకు ప్రజలు సహకరించాలని ఎక్సైజ్ సీఐ మంజుల సూచించారు. గురువారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నాటుసారాను సమూలంగా నిర్మూలించడం కోసం నవోదయం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. అందులో భాగంగా గ్రామ, మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి, నాటు సారా స్థావరాలను గుర్తించి, సారా వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించే కార్యక్రమాలను చేపడతామన్నారు. సారా తయారీ కేంద్రాలపై దాడులు చేసి, విక్రయించేవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. నాటుసారా తయారీ, విక్రయాలపై ప్రజలు 9440902575కు సమాచారం ఇవ్వాలన్నారు.

### కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలి

**కల్లూరు:** జిల్లాలోని కౌలు రైతులకు ఎలాంటి షరతులు (షూరిటీ ) లేకుండా బ్యాంకులు రుణాలు ఇవ్వాలని ఏపీ కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిమ్మయ్య, సత్యనారాయణ కల్లూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద నున్న జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏపీ పంట సాగుదారుల హక్కు చట్టం ప్రకారం గుర్తింపు కార్డు పొందిన వారికి ఎలాంటి హామీలు లేకుండా బ్యాంకులు రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. వారి వెంట రైతులు ఎల్లప్ప, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరావు తదతరులు ఉన్నారు.

### దరఖాస్తుల వెల్లువ



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాణెమ్మ, సిబ్బంది

**సి.బెళగల్:** బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తు గడువు ముగియడంతో గురువారం దరఖాస్తులను కార్యాలయ సిబ్బందితో ఎంపీడీఓ రాణెమ యూనిట్ల వారిగా విభాగాలు చేయించారు. మండల వ్యాప్తంగా 57 యూనిట్లకుగాను 622 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ తెలిపారు.

### గడిగరేవులలో పొలంబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

**గడివేముల:** మండల పరిధిలోని గడిగరేవుల గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ అథారిటీ (ఏపీఎస్ఓపీసీఏ) అధికారి డాక్టర్ మూల ప్రతాపరెడ్డి స్థానిక ఏఓ హేమసుందర్‌రెడ్డితో కలిసి జొన్న పొలాన్ని పరిశీలించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు పండించిన పంట నమూనాలను సేకరించి అక్రెడిటెడ్ లేబొరేటరీలో పురుగు మందుల అవశేషాలు పరీక్షల నిమిత్తం పంపారు. వీఏఏ చంద్రకంటి రమేష్ ఉన్నారు.

### అంధ విద్యార్థులకు చేయూత



సేకరించిన నగదుతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

**పాణ్యం:** కర్నూలు జిల్లా పసుపుల గ్రామంలోని అంధ విద్యార్థులకు పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సేకరించిన రూ.18,057 విరాళాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మేరిసునీతా మాట్లాడుతూ.. ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న అనే నినాదంతో విద్యార్థులు అంధ విద్యార్థులకు తమ వంతు సహాయం చేశారని తెలిపారు. అనంతరం అంధుల పాఠశాల నిర్వాహకులకు నగదు అందజేశారు.

- ముమ్మరంగా సాగుతున్న జొన్న కోతలు
- ఆశించిన స్థాయిలో రాని దిగుబడులు
- ఊసేలేని పంట కొనుగోలు కేంద్రాలు
- నష్టాలు తప్పవని అన్నదాతల ఆందోళన
- మద్దతు ధర ప్రకటించాలని కోరుతున్న రైతులు

# జొన్న.. గిట్టుబాటు ఏదన్నా?



చిందుకూరులో జొన్న కోతలు



గడిగరేవులలో..

**గడివేముల:** రైతులు ఆరుగాలం పడిన శ్రమకు ప్రతిఫలం దక్కే రోజులు వచ్చాయి అనుకుంటున్న క్రమంలో దిగుబడులు అరకొరగా రావడం అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. పంటలను ఆశించే చీడపీడలు, తెగుళ్లు, ప్రకృతి వైపరీత్యాలకు ఎదురొడ్డి పంటను కాపాడుకున్నారు. తాము పడ్డ కష్టాన్ని జొన్న సిరుల రూపంలోకి మార్చుకునేందుకు ఎంతో కష్టపడ్డారు. దిగుబడులు, ధరలు తగ్గడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**జోరుగా కోతలు**

మండలంలో 10,330 ఎకరాల్లో జొన్న పంట సాగు చేశారు. ప్రస్తుతం జొన్న కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు ధాన్యాన్ని కళ్లాలో ఆరబెట్టుకుంటున్నారు. కొనుగోలుపై ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించకపోవడంతో చాలా మంది రైతులు దళారీలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా పచ్చి ధాన్యం, తరుగు పేరిట మద్దతు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో తమకు నష్టం తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు రూ.2300 నుంచి 2400 వరకు కొనుగోలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో జొన్నకు మద్దతు ధర రూ.3180తో కొనుగోలు చేసిందని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఇంకా జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారీలకు విక్రయించి నష్టపోతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అరకొరగా పండిన జొన్నకు మద్దతు ధర ప్రకటించాలని కోరుతున్నారు.

#### గత ప్రభుత్వంలో ఇలా

ఒకప్పుడు దిగుబడులు విక్రయించుకోవాలంటే తలకు మించిన భారంగా ఉండేది. విత్తు వేసింది మొదలు పంట చేతికొచ్చేంత వరకు కంటికి రెప్పలా కాపాడుకోవడం ఒక ఎత్తైతే.. ధాన్యాన్ని విక్రయించుకోవడం మరో ఎత్తు. మార్కెట్ ఉండేది పట్టణాలు, నగరాల్లోనే. అక్కడికి తరలించాలంటే గ్రామాల నుంచి సరైన రవాణా సౌకర్యం ఉండేది కాదు. ఒక వేళ ఉన్నా వాహనాల బాడుగ భరించాల్సి వచ్చేది. ఒక్కోసారి ధర లేక వచ్చిందంతా బాడుగలకే సరిపోయేది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతన్నలను రాజులను చేసింది. వారి కష్టాలను ఒక్కొక్కటిగా తొలగించింది. పంట సాగుకు ఆర్థిక సాయం, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సమకూర్చింది. గ్రామాల్లోనే మార్కెట్లను ఏర్పాట్లు చేసి దిగుబడులను మద్దతు ధరతో కొనుగోలు చేసి అన్నదాతకు అండగా నిలిచింది.

**ధరలు అంతంత మాత్రమే**

కూటమి ప్రభుత్వంలో జొన్నకు నామమాత్రంగా గిట్టుబాటు ధర లభిస్తోంది. గత ఏడాదితో పోల్చుకుంటే బస్తాకు రూ.800 నుంచి రూ. 1000 వరకు తగ్గిపోయినట్లు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ధరల పరిస్థితి ఏంటని రైతులు లోలోన మదనపడుతున్నారు. పంటలను నిల్వ చేసుకునేందుకు గోడౌన్లు లేక తక్కువ ధరకే విక్రయించాల్సిన పరిస్థితి నెలకొందని ఆందోళన చెందుతున్నారు.

**కొనుగోలు కేంద్రాలు ఎక్కడ..?**

జొన్న కోతలు మొదలైనప్పటికీ కొనుగోలు కేంద్రాలు ఎక్కడా ఏర్పాటు కాలేదు. అసలు ఈ కేంద్రాలకు సంబంధించి విధివిధానాలు ఇప్పటి దాకా రూపకల్పనకు నోచుకోలేదు. కేవలం వ్యవసాయాధికారులు ఈకేవైసీ, ఈ పంట నమోదు, విశిష్ట సంఖ్య రిజిస్ట్రేషన్ పైనే దృష్టి పెడుతున్నారు తప్ప జొన్న కొనుగోలు కేంద్రాల గురించి పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

**తగ్గిన దిగుబడి**

గత ఏడాది కంటే ఈసారి దిగుబడులు తగ్గాయి. గతంలో ఎకరా జొన్న పంటకు 20–25 క్వింటాళ్ల దిగుబడి అయ్యేది. కానీ ఈసారి 15 నుంచి 20 క్వింటాళ్ల వరకు మాత్రమే పరిమితమైందని రైతులు చెబుతున్నారు.

#### మద్దతు ధర ప్రకటించాలి



నాకున్న 10 ఎకరాలతో పాటు మరో 10 ఎకరాలు కౌలుకు తీసుకుని మొత్తం 20 ఎకరాల్లో జొన్న పంటను సాగు చేశాను. దిగుబడి అంతంత మాత్రమే రావడంతో పాటు ధర తక్కువ ఉండడంతో పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు. 300 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. వ్యాపారులు బస్తా రూ.2400తో కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తున్నారు. గత ప్రభుత్వం జొన్నకు మద్దతు ధర ప్రకటించడంతో క్వింటా రూ.3180 వరకు అమ్ముకున్నాం. కూటమి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలి.

–చిన్నషాలు, బూజునూరు

#### రైతులను పట్టించుకోవాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను విస్మరిస్తోంది. ఎలాంటి ప్రోత్సాహకాలు ఇవ్వడంలేదు. పెట్టుబడి సాయం అందలేదు. గత ప్రభుత్వంలో క్వింటా జొన్నలు రూ.3180 విక్రయించగా.. అదే క్వింటా ఇప్పుడు రూ.2300తో బయటి వ్యాపార్తులు కొంటున్నారు. జొన్న పంటకు మద్దతు ధర ప్రకటించకపోతే అన్నదాతలు తీవ్రంగా నష్టపోతారు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

–వంగాల మహేశ్వరరెడ్డి, రైతు సంఘం నాయకుడు

#### వ్యాపారులదే రాజ్యం



గత ఏడాది జొన్న పంటకు మంచి గిట్టుబాటు ధర లభించడంతో ఆదాయం చూశాం. క్వింటా రూ.3180కు విక్రయించాం. ఈ ఏడాది 30 ఎకరాల్లో జొన్న సాగు చేశాను. క్వింటా రూ.2300 వరకు రేటు పలుకుతోంది. వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతుల వద్ద తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. విధిలేని పరిస్థితిల్లో పంట దిగుబడులను అమ్ముకోవాల్సి వస్తోంది.

–రాచమల్లు గోపాలయ్య, గడిగరేవుల

### ముగిసిన అంగన్‌వాడీల శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

**సి.బెళగల్:** అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న మొదటి విడత శిక్షణ గురువారంతో ముగిసిందని ఎంఈఓ జ్యోతి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్లకు మూడో రోజు శిక్షణను ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మల్లేశ్వరి, సుజాత నిర్వహించగా, ఎంఈఓ పర్యవేక్షించి సూచనలు చేశారు. అనంతరం ఆర్పీలు మునిస్వామి, ఖడ్గం రాజు అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చారు. **కల్లూరు:** మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల శిక్షణ తరగతులను గురువారం ఎంఈఓ శ్రీనివాసులు ప్రారంభించారు. ఎంపీడీఓ నాగేషాచలరెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. శిక్షణలో నేర్చుకున్న అంశాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 వనజకుమారి, ఐసీడీఎస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### చెత్త సేకరణ కేంద్రాల తనిఖీ



చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ లక్ష్మి

**సి.బెళగల్:** సి.బెళగల్, బురాన్‌దొడ్డి పంచాయతీల పరిధిలో నిర్మించిన చెత్త సేకరణ కేంద్రాల (ఎస్‌డబ్ల్యూఎం) షెడ్లను డీఎల్‌డీఓ లక్ష్మి గురువారం తనిఖీ చేశారు. సి.బెళగల్ షెడ్‌లో వానపాముల తయారీని పరిశీలించారు. గ్రామాల్లోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె ప్రజలకు సూచించారు. అనంతరం సర్పంచ్ పాండురంగన్న గ్రామానికి చెందిన ఆరుగురు పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులను డీఎల్‌పీఓ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఆమె వెంట ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామి, పంచాయతీ కార్యదర్శి సునీల్‌రాణి ఉన్నారు.

## పరిశ్రమల్లో స్థానిక యువతకు అన్యాయం



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

**ఓర్వకల్లు:** పేరుకు మాత్రమే పారిశ్రామిక హబ్.. నియామకాల్లో స్థానిక యువతకు అన్యాయం జరుగుతోందని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు గౌడు అన్నారు. గురువారం స్థానిక బుగ్గరామేశ్వర డిగ్రీ కళాశాలలో ఆయన మాట్లాడుతూ.. ఓర్వకల్లు పారిశ్రామిక హబ్‌లో స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని విమర్శించారు. ఈ ప్రాంత రైతుల నుంచి భూములు తీసుకొని ఇక్కడి యువతకు, కార్మికులకు తక్కువ జీతాలు, ఎక్కువ పనిచేయించి మొండి చేయిచూపిస్తున్నారని ఆరోపించారు. ఏటా మెగా డీఎస్సీ నిర్వహిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం దానిపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు భృతి చెల్లిస్తామని చెప్పి, తీరా ఇప్పుడు మాటమారుస్తున్నారని మండిపడ్డారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి బీసన్న, మండల కార్యదర్శి బాబు, శివ, పవన్, అనిల్, మునిస్వామి పాల్గొన్నారు.

## విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించాలి



కె.సింగవరం పాఠశాల విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈఓ జ్యోతి

**సి.బెళగల్:** ఉపాధ్యాయులు విద్యార్థులలో విద్యా నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేయాలని ఎంఈఓ జ్యోతి అన్నారు. గురువారం ఆమె మండల పరిధిలోని ఈర్లదిన్నె ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. పరిసరాలను, తరగతి, వంట గదులను, రికార్డులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిష్టర్లను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం పాఠ్యాంశాల బోధన, పాఠశాల నిర్వహణపై ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు. అనంతరం కొత్తకోట రెగ్యులర్ పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి, మెనూ, శుచి, శుభ్రతపై నిర్వాహకులకు సూచనలు చేశారు.

## జాతీయ రహదారిపై ఆక్రమణల తొలగింపు



జేసీబీతో తొలగిస్తున్న ఆక్రమణలు

**ఓర్వకల్లు:** మండలంలోని నన్నూరు గ్రామంలో జాతీయ రహదారిపై ఆక్రమణ తొలగింపునకు అధికారులు ఉపక్రమించారు. స్థానిక బంగ్లా బస్టాండ్ ప్రాంతంలో గతంలో సర్వీస్ రోడ్డు నిర్మాణం కోసం వదిలిపెట్టిన స్థలాన్ని స్థానిక వ్యాపారులు ఆక్రమించుకుని యథేచ్ఛగా వ్యాపారాలను నిర్వర్తిస్తున్నట్లు గుర్తించారు. హైవే అధికారులకు వచ్చిన ఫిర్యాదు మేరకు జాతీయ రహదారుల రూట్ ఆఫీసర్ నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గురువారం జేసీబీ సహాయంతో ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టారు. త్వరితగతిన తొలగించి రోడ్డు విస్తరణ పనులు చేపడుతామని అధికారులు తెలిపారు. జాతీయ రహదారిపై ఎక్కడైనా ఆక్రమణలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఇంజినీరింగ్ అధికారులు, హైవే సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్‌జీఎం కళాశాలలో జాతీయ సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న డీన్ అశోక్ కుమార్

**పాణ్యం:** స్థానిక ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో గురువారం జాతీయ సదస్సు జరిగింది. రాష్ట్రంలోని వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఇలాంటి సదస్సులతో విద్యార్థుల్లో ఉన్న ప్రతిభ, ఆత్మవిశ్వాసం, విషయ అవగాహన పెరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్ర ప్రసాద్, డీన్ డీవీ అశోక్ కుమార్ తెలిపారు. విభాగాధిపతి డాక్టర్ సుబ్బారెడ్డి, కన్వీనర్ డాక్టర్ శ్రావణ్ కుమార్ రెడ్డి, నవీన్ సుందర్ కుమార్ పాల్గొన్నారు.

## 4 వేల మందికి యూనిక్ సంఖ్య నమోదు



గుర్తింపు సంఖ్యను నమోదు చేయించుకుంటున్న రైతులు

**సి.బెళగల్:** మండలంలోని రైతులకు ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్య (యూనిక్ కోడ్ – యూసీ) నమోదు నాలుగు వేలకు చేరుకుందని ఏఓ మల్లేష్ కుమార్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని పోలకల్ రైతు సేవా కేంద్రం – 3లో రైతులు యూసీలను నమోదు చేయించుకున్నారు. కాగా 15 రైతు సేవా కేంద్రాలలో దాదాపు పది వేలకు పైగా రైతులు ఉండగా ఇప్పటి వరకు 4,011 మంది రైతుల వివరాలను నమోదు చేసి, వారికి యూసీలను జారీ చేశామని ఏఓ తెలిపారు.

### నకిలీ బర్త్ సర్టిఫికెట్లపై విచారణ చేయండి

**కర్నూలు(హాస్పిటల్):** కర్నూలులో నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు (బర్త్ సర్టిఫికెట్లు) సృష్టించడంపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక న్యాయవాది గణేష్ కోరారు. ఈ ఘటనపై ఆయన గత నెల 25వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఫిర్యాదు చేశారు. అలాగే నకిలీల ఘటనపై గత నెల 24వ తేదీన 'సాక్షి' దినపత్రికలో 'నకిలీ సర్టిఫికెట్లు పుట్టుకొస్తున్నా య్!' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఆసుపత్రి సీఎస్ ఆర్ఎంఓ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకి లీ జనన ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నా రని, అ లాంటి వారిపై చర్యలు తీసుకోవాలని సూప రింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు, స్థానిక మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశామన్నారు.ఇలాంటి నకిలీ సర్టిఫికెట్ల ద్వారా పాస్‌పోర్టులు, ప్రభుత్వం అందించే పలు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అయితే ఇందుకు సంబంధించి అధికారుల నుంచి ఎలాంటి స్పందన, చర్యలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు.

### ఉచిత విద్యుత్ హామీ అమలుచేయాలి



మాట్లాడుతున్న సి.గురుశేఖర్

**కర్నూలు(సెంట్రల్):** సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రజక లాండ్రీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని వెంటనే అమలు చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. అలాగే రజకులకు అవసరమైన దోబీలు, లాండ్రీ పరికరాలను ఉచితంగా ఇవ్వాలన్నారు. గురువారం చాకలి ఐలమ్మ కార్యాలయంలో ఏపీ రజక వృత్తిదారుల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రజకుల రక్షణకు చట్టం తేవాలన్నా రు. గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ రజకులపై దాడులు జరుగుతున్నాయన్నారు. వాటి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. మార్చి 22న జరిగే 6వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సి.ముక్కన్న, రాముడు, శ్రీనివాసులు, శేషాద్రి పాల్గొన్నారు.

### కోలుకోలేక మహిళ మృతి

**కర్నూలు:** జోగులాంబ గద్వాల జిల్లా అనంతపు రం గ్రామానికి చెందిన కొండమ్మ (31) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతిచెందింది. ఈ నెల 15న భర్త ఎల్లప్పతో కలిసి స్వగ్రామం నుంచి కర్నూలుకు వస్తుండగా పంచలింగాల వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో దంపతులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ఎల్లప్ప చికిత్స పొందుతూ 16వ తేదీ మృతి చెందగా కొండమ్మ చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందింది. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం ఉన్నారు. ప్రమాద ఘటనపై కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

### పీడీని కలిసిన వెలుగు సిబ్బంది

**కల్లూరు:** డీఆర్‌డీఏ పీడీగా బాధ్యతలు తీసుకు న్న రమణారెడ్డిని కల్లూరు పొదుపు సంఘం మహిళలు, ఏపీఎం పుష్పావతి, మండల సమైక్య అధ్యక్షురాలు జుబేదాబీ, సిబ్బంది గురువారం కలిశారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. సీసీలు గంగాధర్, నాగన్న, జయమ్మ, రాజశేఖర్, రాముడు పాల్గొన్నారు.

## బీసీ కులగణన చేపట్టాలి



సంఘీభావం తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు

**కర్నూలు(అర్బన్):** రాష్ట్రంలో బీసీ కులాల గణన చేపట్టాలని పలు బీసీ సంఘాల నేతలు కోరారు. గురువారం స్థానిక బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు ఆధ్వర్యంలో బీసీ కుల సంఘాల నేతల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నక్కలమిట్ట శ్రీనివాసులు మాట్లాడుతూ.. బీసీల జనాభా నిష్పత్తి ప్రకారం విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో వాటాలు కల్పించాలన్నారు. రాష్ట్రంలో బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు విద్య, ఉద్యోగ రంగాల్లో ఏబీసీడీ వర్గీకరణ చేసిన విధంగానే రాజకీయ రంగాల్లో కూడా వర్గీకరణ చేసి ఎంబీసీ కులాలకు న్యాయం చేయాలన్నారు. ఇంతవరకు చట్టసభల్లో అడుగుపెట్టని ఎంబీసీ కులాలకు రాజ్యసభ, ఎమ్మెల్సీ, రాష్ట్రస్థాయి నామినేటెడ్ చైర్మన్ పదవులు కేటాయించాలన్నారు. ఆయా కుల కార్పొరేషన్ల ద్వారా లబ్ధిదారులకు రుణాలు అందించే విషయంలో బ్యాంకులతో సంబంధం లేకుండా నేరుగా రుణాలను అందించాలన్నారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో బీసీల అభివృద్ధికి, సబ్‌ప్లాన్ అమలుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. ఈ డిమాండ్ల సాధనకు దశల వారీగా ఉద్యమాలకు శ్రీకారం చుడతామన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావుయాదవ్, బీసీ నాయకులు ఎం.రాంబాబు, ఆనంద్‌బాబు, ధర్మ, వాడాల నాగరాజు, రంగా తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంట్లో రాజ్యాంగ పుస్తకం ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి పి.లీలా వెంకటశేషాద్రి

**కర్నూలు కల్చరల్:** ప్రతి ఇంట్లో భారత రాజ్యాంగ పుస్తకం ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి.లీలా వెంకటశేషాద్రి పేర్కొన్నారు. గురువారం క్లస్టర్ విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రభుత్వ పురుషుల కళాశాల, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన వేదిక, సామాజిక న్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే ఉచిత న్యాయ సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలన్నారు. న్యాయ సేవల అవగాహన కోసం ప్రతి ఇంట్లో భారత రాజ్యాంగం ఉండాలన్నారు. న్యాయ చట్టాలను పాటిస్తామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాశాంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యుడు రాయపాటి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

**కర్నూలు(సెంట్రల్):** రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు బకాయి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రూ.3500 కోట్లను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ, ఉపాధ్యక్షుడు రమణకుమార్ డిమాండ్ చేశారు. గురువారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. వెంటనే అమ్మ ఒడి పథకాన్ని అమలు చేసి ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో రూ.15 వేలు జమ చేయాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.5 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచి ఇవ్వాలన్నారు. అన్ని హాస్టళ్లకు సొంత భవనాలను కట్టించి ఇవ్వాలన్నారు. యూజీసీ డ్రాఫ్ట్ సవరణను ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని కోరారు. నాయకులు దామోదర్, రాజు, మద్దూరు, సూర్య, సాయి పాల్గొన్నారు.